సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం : 23 : జూలై : 2025



మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆలయంలో మంగళవారం ఆంజనేయ స్వామికి సుప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు.



'కోటిపల్లి' నిర్మాణంలో కదలిక

నరసాపురం–కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో కదలిక వచ్చింది. పెండింగ్‌లో ఉన్న స్థల సేకరణ విషయంలో రైల్వేశాఖ ముందడుగు వేస్తోంది. 8లో ▸



టిడ్కో ఇళ్ల సమస్య పరిష్కరించాలి

టిడ్కో ఇళ్లను పూర్తి చేసి సౌకర్యాలు కల్పించి అర్హులకు అందించాలంటూ మంగళవారం పాలకొల్లులో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయం



ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ పోస్టర్లు చూపుతున్న డీఎన్నార్ తదితరులు

కై కలూరు: రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వర రావు (డీఎన్నార్) మండిపడ్డారు. కై కలూరు సీతారామ ఫంక్షన్ హాలులో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి పాలనలో జరుగుతున్న అన్యాయాలపై రెండు ఎల్‌ఈడీ భారీ స్క్రీన్లపై ప్రదర్శన ఆకట్టుకుంది. డీఎన్నార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్రమ అరెస్టులను ఖండించాలన్నారు.

రేషన్ షాపుల తనిఖీ



ఆకివీడులో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

ఆకివీడు: రాష్ట్రంలో ఆకివీడులోని సచివాలయం –1 పరిధిలోని మూడు రేషన్ షాపులు అధ్వానంగా పనిచేస్తున్నాయని, ప్రజా వ్యతిరేకతలో ప్రథమ స్థానంలో ఉన్నాయని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మూడు రేషన్ షాపుల్ని తనిఖీ చేశారు. బియ్యం అమ్మకాలు, నిల్వల రికార్డు, బియ్యం పరిశీలించారు. అనంతరం డీలర్లతో మాట్లాడుతూ వినియోగదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, సమయానికి షాపు తెరవడం లేదని, వృద్ధులకు, ఇతరులకు వేలిముద్రలు వేయించుకుని సరుకులు ఇవ్వడంలేదనే ఆరోపణలు ప్రభుత్వ విచారణలో తేలాయని చెప్పారు. ఈ విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. వీఆర్వోలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. ప్రతీ వంద మంది వినియోగదారుల వద్దకు వెళ్లి డీలర్ల వల్ల అసౌకర్యం జరుగుతుందా, సరుకులు బాగా ఇస్తున్నారా లేదా అనేది విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

సురక్షితంగా తల్లి చెంతకు



తల్లికి బాలికను అప్పగిస్తున్న ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్, సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో రూరల్ ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో సోమవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను తనిఖీ చేశారు. ఆటోలో పాఠశాల యూనిఫాంతో బాలికను గుర్తించి ఆరా తీశారు. తల్లి మందలించటంతో ఇల్లు వదిలి విజయవాడ వెళ్లాలనే ఉద్దేశంతో ఏలూరు వచ్చిందని తెలిసింది. వెంటనే అప్రమత్తమైన ఎస్సై పూర్తి వివరాలు సేకరించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలికను సురక్షితంగా తల్లికి అప్పగించారు.

దాడి ఘటనలో 12 మందిపై కేసు

పెదవేగి: ఓ వ్యక్తిపై దాడి చేసి అతని పామాయిల్ గెలలు అపహరించుపోయారన్న ఫిర్యాదుపై పెదవేగి పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. పెదవేగి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరు మండలం సోమవరప్పాడుకు చెందిన వేమూరి బసవపున్నయ్య పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో పామాయిల్ సాగు చేస్తున్నాడు. ఈ నెల 21న తోటలోని గెలలను కోసి పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీకి తరలిస్తుండగా, మధ్యలో సుమారు 25 బైక్‌లపై కొంతమంది దౌర్జన్యంగా బసవపున్నయ్య, ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి చేసి, కంట్లో కారం కొట్టి, బలవంతంగా పామాయిల్ గెలల లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను రామశింగవరం కలెక్షన్ పాయింట్‌కు తరలించి, అక్కడ అన్‌లోడ్ చేశారు. ఈ ఘటనలో వేంపల నాగరాజు, వెంపల తంబి, కల్లెం చిన దాసు, ఉప్పె రంగరావు, దానం శ్రీను, చిమ్మె సురేష్, వలుకుల వినోద్, వలుకుల తాతబాబు, వలుకుల సుబ్రహ్మణ్యం, బొమ్మగంటి చిన్న సురేష్, బొమ్మగంటి పెద్ద సురేష్, పరుచూరి వరుణ్ చౌదరిలపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.

మహిళల భద్రత ప్రశ్నార్థకం

- పశ్చిమలో పేట్రేగిపోతున్న హింసా ప్రవృత్తి
- గంజాయి మత్తులో యువత
- లైంగిక దాడికి బలవుతున్న చిన్నారులు, యువతులు
- పోక్సో కేసులతో సరిపెడుతున్న పోలీసులు
- ఉమ్మడి జిల్లాలో వారానికో ఘటన జరిగినా స్పందన శూన్యం



సాక్షి ప్రతినిధి, ఏలూరు : చిన్నారులకు రక్షణ లేదు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి పూర్తిగా తెలియకుండానే అత్యాచారాలకు గురవుతున్నారు. గంజాయి మత్తులో మానవ మృగాలు వావీవరుసలు చూడకుండా అత్యాచారాలకు తెగబడుతున్నారు. ప్రశాంతతకు మారుపేరైన ఉమ్మడి పశ్చిమలో ఓ వైపు గంజాయి గుప్పుమంటుంటే.. మరోవైపు అత్యాచార ఘటనలు వ్యవస్థకే సవాలుగా మారుతున్నాయి. అత్యాచారం జరిగాక.. అది కూడా బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే సాధారణ కేసుల్లాగా పోక్సో కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం మినహా పోలీస్ వ్యవస్థ మరేమి చేయకపోవడంతో మహిళా భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చిన్నారులు మొదలుకొని అనేక మందిపై లైంగిక దాడులు, అత్యాచారాల ఘటనలు తరుచూ జరుగుతున్నాయి. ప్రధానంగా గంజాయి మత్తులో ఎక్కువ నేరాలు ఘటనలు జరుగుతున్నట్లు గుర్తించినా కట్టడి చేస్తున్న దాఖలాలు అంతగా లేదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పోలీసులు గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం.. పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేస్తున్నామని ప్రత్యేక సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తున్నారే తప్పా మూలాల్లోకి వెళ్లి కట్టడికి ప్రయత్నించని పరిస్థితి. ఏలూరు జిల్లాలో ఇంతవరకు 20 గంజాయి కేసులు నమోదు చేసి 700 కేజీల గంజాయిని సీజ్ చేసి 40 మందిని అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 64 కేసులు నమోదు చేసి 641 కేజీల గంజాయిని సీజ్ చేశారు. అంతే తప్ప ఒడిశా నుంచి ఎలా వస్తుంది.. స్థానిక విక్రేతలు ఎవరు.. గతంలో సస్పెక్ట్ షీట్లు నమోదైన వారు, గతంలో కేసుల్లో అరెస్టు అయిన వారు ఏం చేస్తున్నారు.. జిల్లాలో పరిస్థితి ఏంటనే దానిపై పూర్తి స్థాయిలో సమీక్షించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజూ గంజాయి మత్తులో ఏదోచోట దాడులు, దౌర్జన్యాలు సాగుతూనే ఉన్నాయి. దీంతో పాటు అత్యాచార కేసులు కూడా ఎక్కువగా నమోదు కావడం కలవరపరుస్తుంది.

ఆరు నెలల్లో అకృత్యాలు ఇలా..

చిన్నారులపై లైంగిక దాడి, ప్రేమ పేరుతో యువతిని వంచించి ప్రియుడితో పాటు అతని స్నేహితులు కూడా అత్యాచారానికి తెగపడటం, చిన్నారిపై మారుతండ్రి అఘాయిత్యం ఇలా అనేక ఘటనలు గత ఏడు నెలల కాలంలో జిల్లాలో నమోదయ్యాయి. కేంద్రం ఆధ్వర్యంలో నడిచే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)లోని లైంగిక వేధింపుల ఘటన, అరెస్టులు తీవ్ర కలకలం రేపాయి. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో నాలుగేళ్ల బాలికపై లారీ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మీర్జాపురంలో 11 ఏళ్ళ బాలికపై ఇంటి పక్కన ఉండే నాగమల్లేశ్వరరావు అత్యాచారానికి పాల్పడ్డాడు.

- మార్చి 21న ఏలూరు నగరంలో ఆరున్నరేళ్ల చిన్నారిపై మారుటి తండ్రి అకృత్యాలకు పాల్పడడంపై కేసు నమోదైంది. తల్లికి అనుమానం వచ్చి బయటకు వెళుతూ బీరువాపై సెల్‌ఫోన్ వీడియో కెమెరా ఆన్ చేసి వెళ్ళింది. కొంతసేపటి తరువాత ఇంటికి వచ్చి సెల్‌ఫోన్‌ను పరిశీలించగా తన కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోను చూసింది. వెంటనే స్థానికులకు చెప్పడంతో అతన్ని ఇంట్లోనే నిర్బంధించి పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదైంది.
- మార్చి 23న ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన యువతిపై ప్రియుడు ఆళ్ళ వంశీకృష్ణ వీడియోలు ఉన్నాయని బెదిరింపులకు పాల్పడి అతనితో పాటు అతని స్నేహితులు సాయి చరణ్, శివశంకర్‌లు అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు.
- జూలై 14న ఏలూరు కొత్తపేట ప్రాంతానికి తెర్రి సత్యనారాయణ అనే వృద్ధుడు అదే ప్రాంతానికి చెందిన చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక అమ్మమ్మ వృద్ధుడి ఇంటికి సమీపంలో ఉంటుంది. బాలిక పాఠశాలకు వెళ్తూ ఉండగా మాయమాటలు చెప్పి బాలికపై అత్యాచారానికి పాల్పడేవాడు. బాలిక ఆరోగ్యం బాగోలేకపోవడంతో తల్లి ఆరా తీయగా జరిగిన విషయాన్ని చెప్పింది.
- నూజివీడు మండలం పల్లెర్లమూడిలో నాలుగేళ్ళ బాలికపై లారీ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మీర్జాపురంలో 11 ఏళ్ళ బాలికపై ఇంటి పక్కన ఉండే నాగమల్లేశ్వరరావు అత్యాచారానికి ఒడిగట్టాడు.
- పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు సంతపేటలో ఈ ఏడాది జూన్లో మైనర్ బాలికపై టీడీపీ సీనియర్ కార్యకర్త షేక్ మీరా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు రిమాండ్‌లో ఉన్నాడు.

బెల్ట్ షాపులు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

ఏలూరు (టూటౌన్): సందుకో బెల్ట్ షాపుతో కల్లుగీత వృత్తి చిన్నాభిన్నం అయిపోయిందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏలూరు సర్కిల్ కల్లుగీత కార్మికుల సమావేశం మంగళవారం బెజవాడ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో బెల్ట్ షాపులు ఐదు వేల వరకు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కల్తీ మద్యం హల్ చల్ చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తామని సీఎం ఆదేశాల ప్రకారం తక్షణం బెల్ట్ షాపులు తొలగించి కల్లుగీత కుటుంబాలకు ఉపాధి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కల్లుగీత కుటుంబాలను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కన్నీరు పెట్టిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి పరవాడ కేంద్రంగా కల్తీ మద్యం రాకెట్ పాలకొల్లును స్థావరంగా చేసుకొందన్నారు. పాలకొల్లులో కల్తీ మద్యం తయారుచేసి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాలకు పారిస్తున్నట్లు పత్రికలలో వస్తున్నా అధికారులు స్పందించకపోవడం అన్యాయం అన్నారు. హైదరాబాద్ నుంచి స్పిరిట్ తీసుకొచ్చి రంగు నీళ్ల కలిపి బ్రాండెడ్ కంపెనీల బాటిల్స్‌లో నింపి విక్రయిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత అనుచరుడే కల్తీ దందా నడుపుతున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోందన్నారు. ఆగస్టు 18న గీత కార్మికులందరూ మన గోడు ఏలూరు కలెక్టర్ గారికి చెప్పుకుందాం కార్యక్రమానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

అక్కడ ఏడాదంతా పందేల జాతరే

- పోలీసులు అసలు పట్టించుకోరు
- నిఘా కూడా అంతే...
- అధికార పార్టీ ఆశీస్సులు, అండాదండాతోనే యథేచ్ఛగా

సాక్షి, టాస్క్ ఫోర్సు: ఆ ఆసామి తాలూకా వ్యవసాయ క్షేత్రం ప్రయోగాలకు కేంద్రంగానే కాకుండా, జూద క్రీడా ప్రాంగణంగా మారడం చర్చనీయాంశంగా మారింది. ఈ తోటకు తాడేపల్లిగూడెం వ్యాపార కేంద్రంలో మంచి పేరుంది. ఒకప్పుడు పేకాటకు కేరాఫ్‌గా ఉండే ఈ ప్రాంతం నూతన ప్రభుత్వ హయాంలో కోడి పందేల అడ్డాగా మారింది. రాత్రయితే జాతరే జాతర. తొమ్మిదైతే చాలు తోటకు నలువైపులా ఉన్న దారులు తెరుచుకుంటాయి. క్వారీ ల్యాండ్, లారీ స్టాండ్‌లు దాటి వచ్చిన వాహనాలు ఈ తోట వైపునకే దారి తీస్తాయి. ప్రైవేటు సైన్యం పహరాలో , నిఘాలో ఉన్న ఈ క్షేత్రానికి ఉన్న రెండు ద్వారాలు ఐడెంటిఫికేషన్ పరేడ్ ముగిసిన తర్వాత వాహనాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ఇక ఆ తర్వాత ఫ్లడ్‌లైట్ల



తాడేపల్లిగూడెం శివారులో పందేల జాతరకు వెళ్లే దారులు ఇవే

కాంతిలో కొక్కొరొకో శబ్దాలు, కాయ్‌రాజా కాయ్ అంటూ పందెగాళ్ల నోట్ల కట్టలతో జూద క్రీడా విన్యాసంతో వీర విహారం చేస్తారు. రాత్రంతా కోడి పందేలు నిర్వహిస్తున్నా, పోలీసులు తమకేం తెలియదన్నట్టు అటువైపు వెళ్లడానికి సాహసించరు. అధికారానికి సలాం అంటూ మాకెందుకులే అనుకుంటారు. దీంతో ఈ జూద క్రీడకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎంత నిఘా ఉన్నా ఉన్నతాధికారులు ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసు డివిజన్ కార్యాలయం జూద క్రీడా ప్రాంగణంగా చెబుతున్న ప్రాంతానికి కొద్ది దూరంలోనే ఉన్నా, అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో తెలియదంటున్నారు. కొన్ని రోజులు జూదాలకు అడ్డుకట్ట పడినట్టుగా కనిపించినా ప్రస్తుతం వారం రోజులుగా కోడి పందేలు ఆ తోటలో యథేచ్ఛగా సాగుతున్నాయని అంటున్నారు. టార్పాలిన్ పందిరి, చుట్టూ ఫెన్సింగ్, కుర్చీలు, తినేందుకు అన్ని వసతులు ఆ తోటలో సమకూర్చడంతో రాష్ట్రంలోని పందెంగాళ్లు ఇక్కడకు డబ్బుల కట్టలతో వాలిపోతున్నారు.

అధికారం అండతోనే.. జూద నిర్వాహకులు కూటమికి చెందిన పార్టీ నేతగా చెబుతున్నారు. పందేల నిర్వాహణలో పీహెచ్‌డీ చేసిన ఆ వ్యక్తి నేతృత్వంలో జూద దందా మూడు పందేలు.. ఆరు నోట్ల కట్టలుగా సాగుతుందని చెబుతున్నారు. అధికార నేతల అండదండలతో అసాంఘిక కార్యక్రమాలు సాగుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పందేలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి కోసం బిందెలతో నిరసన



ఆచంట వేమవరం పడమటి పాలెంలో తాగునీటి కోసం బిందెలతో నిరసన

పెనుగొండ: దళిత వాడలో తాగునీటి పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆచంట వేమవరం శివారు పడమటి పాలెంలో మహిళలు బిందెలతో నిరసన తెలిపారు. మంగళవారం ఉదయం కుళాయి వద్ద బిందెలతో ఆందోళన చేశారు. వీరికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మద్దతు పలికారు. దళిత వాడపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లో తాగునీటిని అందిస్తూ దళిత వాడకు అందించడం లేదన్నారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా గ్రామ కార్యదర్శి ఇంతవరకూ పరిష్కరించలేదన్నారు. డ్రెయినేజీలు ఏర్పాటు చేయడంలేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిల్లి స్వరూప రాణీ, తరపట్ల గంగారత్నం, సాక జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ ఉపకార వేతనం (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ఎంపికైన విద్యార్థులు వచ్చే ఆగస్టు 31లోగా న్యూఢిల్లీ కేంద్ర మానవ వనరుల శాఖ వెబ్‌సైట్ పోర్టల్‌లో నమోదు చేసుకుని దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ వివరాలను సరిచూసుకొని పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు, ఆధార్, బ్యాంకు బుక్‌లో తేడాలు ఉంటే వెంటనే సరి చేయించుకోవాలని లేదంటే సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా డీఈఓ కార్యాలయంలో వివరాలు సమర్పించాలన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు కూడా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. పథకం విధివిధానాలు ఎన్‌ఎంఎంఎస్ పోర్టల్‌లో పొందవచ్చన్నారు.

వైద్య సేవల్లో అలసత్వంపై కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల పని తీరుపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. లక్ష్య సాధనలో కొన్ని పీహెచ్‌సీలు వెనుకబడడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై రోగులకు వైద్య సేవలు అందిస్తే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. గర్భిణులకు కాన్పు జరిగే వరకు అవసరమయ్యే వైద్య పరీక్షలు, పౌష్టికాహారంపై పూర్తి అవగాహన కల్పించి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఆస్పత్రులలో ప్రసవాలు పెరిగే విధంగా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎక్కువ డెలివరీలు చేసే ప్రభుత్వ ఆసుపత్రులకు అవార్డులను ప్రకటిస్తామన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు డెలివరీలపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఈ వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ గమనించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటకు అంగన్‌వాడీలు సిద్ధం

- సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్
- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని వినతి
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు పోరు బాటకు సిద్ధమవుతున్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే ఏలూరు కలెక్టరేట్, ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం మాత్రం సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోవడంతో అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా కోరుతున్న సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టేందుకు వెనుకాడేది లేదని హెచ్చరిస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఎన్నికల ముందు చెప్పిన వాటి ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మకు వందనం అంగన్‌వాడీలకు ఎందుకు వేయలేదని ప్రశ్నిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీకు అమ్మకు వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మినీ వర్కర్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ సెంటర్లు నిర్వహిస్తున్నారని వారిని వెంటనే మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముఖ గుర్తింపు విధానం రద్దు చేయాలి

ముఖ గుర్తింపు విధానాన్ని తక్షణం రద్దు చేయాలని కోరుతున్నారు. 2022 లో ఇచ్చిన మొబైల్ ఫోన్‌లో యాప్‌లు పని చేయడం లేదని, యాప్‌లో అప్‌లోడ్ చేయకపోతే సరుకులు ఇవ్వమని చెప్పడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాలలో నేటికీ సిగ్నల్స్ రాక అనేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. తక్షణమే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పేస్ యాప్ రద్దు చేయాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్లు

- టేక్ హోం రేషన్, ఇతర సేవల కొరకు ఎఫ్‌ఆర్‌ఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసే నిబంధన అమలును వెంటనే ఆపాలి.
- అంగన్‌వాడీ రిపోర్టింగ్ విధానం డిజిటలైజేషన్ అమలుకు ముందే ఆయా కేంద్రాలన్నింటికీ కంప్యూటర్/లాప్‌టాప్/టాబ్‌లు అందించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్రీ వైఫై కనెక్షన్ అందించాలి. లేదా డేటాకు సరిపడా నగదు చెల్లించాలి.
- సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆధార్ ధ్రువీకరణ, ముఖ గుర్తింపు వంటివేమీ లేకుండానే లబ్ధిదారులందరికీ నాణ్యమైన అనుబంధ పోషకాహారాన్ని అందించాలి.
- పోషణ్ ట్రాకర్ యాప్‌కు సంబంధించిన సమస్యలు చర్చించటానికి అంగన్‌వాడీ ఫెడరేషన్స్ అన్నింటితో కలిపి మూడు పక్షాలతో కూడిన సమావేశం వెంటనే నిర్వహించాలి.
- నెలకు రూ.26 వేల కనీస వేతనం, పెన్షన్, సామాజిక భద్రతా సదుపాయాలు ,గ్రాట్యుటీ వంటివి అమలు చేయాలి.

ఎఫ్‌ఆర్‌ఎస్‌ను తక్షణం రద్దు చేయాలి



అంగన్వాడీలకు భారంగా మారిన ఎఫ్‌ఆర్‌ఎస్ (ముఖ కవళికల గుర్తింపు) విధానాన్ని తక్షణం రద్దుచేయాలి. నాణ్యమైన సెల్ ఫోన్లు, నెట్ కనెక్షన్లు అందించాలి.ఇతర కారణాల వల్ల రిజిష్టర్ కాని అంగన్వాడీ లబ్ధిదారులకు మాన్యువల్‌గా రేషన్ అందించేందుకు అవకాశం కల్పించాలి.

– పి.సుజాత, అధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.26 వేలు కనీస వేతనం అందించాలి. పీఎఫ్, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ అందించాలి. అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులను తక్షణం నిలుపుదల చేయాలి. అంగన్‌వాడీల పోరాటానికి సీఐటీయూ మద్దతు ఇస్తుంది.

– డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ

హామీలను నెరవేర్చాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా చిరు ఉద్యోగులమైన అంగన్‌వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదు. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని రద్దుచేసేలా చూడాలి.

– పి.భారతి, ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

సంక్షేమ పథకాలను అమలు చేయాలి



అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటినీ అమలు చేయాలి. తల్లికి వందనం పథకంను అంగన్వాడీలకు ఇవ్వక పోవడం సరికాదు. మినీ సెంటర్లను మెయిన్‌సెంటర్‌లుగా మార్చాలి. సెంటర్ మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించాలి. అపరిష్కృతంగా ఉన్న అంగన్వాడీల సమస్యలపరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– టి.మాణిక్యం, కోశాధికారి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో కదలిక

- రెండవ విడత స్థల సేకరణకు గ్రీన్ సిగ్నల్
- 2019–24 మధ్య నుంచి ప్రతి బడ్జెట్‌లో నిధులు
- కూటమి హయాంలో తొలి బడ్జెట్‌లోనే మొండిచేయి
- ఏటా పెరుగుతున్న అంచనా వ్యయం
- ఇప్పటికైనా ప్రాజెక్ట్ పరుగులు పెట్టేనా?



నరసాపురం రైల్వేస్టేషన్



కోటిపల్లి రైల్వేస్టేషన్

నరసాపురం: నరసాపురం–కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో మళ్లీ కాస్త కదిలిక వచ్చింది. ఈ భారీ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న స్థల సేకరణ విషయంలో రైల్వేశాఖ ముందడుగు వేస్తోంది. ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా రెండవ విడత స్థల సేకరణ చేయాలని నిర్ణయించి, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి నిధులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో స్థల సేకరణ కూడా పెండింగ్‌లోనే ఉంది. మొత్తం 54 కిలోమీటర్లు పొడవులో నిర్మించే ఈ రైల్వేలైన్ కోసం దాదాపు 200 ఎకరాల భూమి సేకరించాలి. తొలి దశ కింద 158.55 ఎకరాలు సేకరించారు. తూర్పుగోదావరి జిల్లాలో భట్లపాలెం, కామనగరువు ప్రాంతాలు అమలాపురం మండలంలో భట్నవిల్లి, రోళ్లపాలెం, భట్లపాలెం, పేరూరు పరిధిలో ప్రాంతాల్లో 60 శాతం స్థలసేకరణ జరిగింది. ఈ ప్రాంతాల్లో మిగిలిన 40 శాతంతో పాటు పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో భూసేకరణ రెండవ విడతలో చేపట్టనున్నారు. అయితే ఇప్పటి వరకూ సేకరించిన భూమిలో బాధితులకు పూర్తిస్థాయిలో ఇంకా నష్టపరిహారం చెల్లించనేలేదు.

కూటమి హయాంలో తొలి బడ్జెట్‌లోనే మొండిచేయి

2001లో ఈ రైల్వేలైన్ నిర్మాణం ఆలోచన ఊపందుకున్న తరువాత 2019 నుంచి ప్రతి బడ్జెట్‌లోను ఈ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించారు. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు కూడా అప్పటి వైఎస్సార్‌సీపీ ఎంపీల కృషితో కేంద్రం ప్రతి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. విచిత్రం ఏమిటంటే కేంద్రంలోని బీజేపీతో జతకట్టి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రవేశపెట్టిన 2025–26 తొలి రైల్వే బడ్జెట్‌లో నరసాపురం–కోటిపల్లి రైల్వేలైన్‌కు నిధుల కేటాయింపులో మొండిచేయి దక్కడం చెప్పుకోవాలి. రూ 2,800 కోట్ల అంచనా వ్యయంగల ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించి గోదావరిపై మూడు పాయల వద్ద వంతెన నిర్మాణం చేయాలి. వంతెన నిర్మాణాలకు రూ.700 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి టెండర్లు పిలిచి రెండేళ్ల క్రితం ప్రారంభించారు. అయితే అరకొర కేటాయింపులతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరి రెండవ విడత స్థలసేకరణ పూర్తయిన తరువాత పనులు పరిగెడతాయో లేదో చూడాలి. ప్రాజెక్ట్ నిర్మాణం ఆలస్యం అవుతుండటంతో ప్రతి ఏటా నిర్మాణ అంచనా వ్యయం కూడా పెరుగుతూ వస్తోంది. 2001లో రూ.800 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం ప్రస్తుతం రూ.2,800 కోట్లకు చేరింది.

ఎప్పటి నుంచో డిమాండ్

మచిలీపట్నం–గుడివాడ–భీమవరం వరకూ ఉన్న రైల్వే లైన్‌ను 1925లో నరసాపురం వరకూ పొడిగించారు. అప్పటి నుంచి నరసాపురం టు కోనసీమకు రైల్వేలైన్ అనుసంధానం కావాలనే డిమాండ్ ఉంది. దీనివల్ల రవాణా మార్గం సులభమవుతుందని, వ్యాపార వ్యవహారాలతో మొత్తంగా గోదావరి జిల్లాలు అభివృద్ధి బాట పట్టే అవకాశం ఉందని భావించారు. ఇక అప్పటి నుంచీ కోటిపల్లి నుంచి నరసాపురం వరకూ రైల్వేలైన్‌ను పొడిగించాలనే డిమాండ్ ఉంది. దివంగత లోక్‌సభ స్పీకర్ బాలయోగి చొరవతో ఈ ప్రాజెక్ట్‌కు బీజం పడింది. 2001–02 బడ్జెట్‌లో తొలిసారిగా రూ.100 కోట్లు కేటాయించారు. కానీ నిధులు మాత్రం విడుదల కాలేదు. తరువాత 2016–17 బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించారు. సర్వేకే ఈ నిధులు చాలని పరిస్థితి. 2019 నుంచి గత ఏడాది వరకూ వరుసగా నిధులు కేటాయించారు. ఇప్పటికి సుమారుగా రూ.1900 కోట్లు నిధుల కేటాయింపు జరిగింది.

వంతెనలకే ఖర్చు ఎక్కువ

ఈ ప్రాజెక్ట్ 25 శాతం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మాణమవుతోంది. ఈ ప్రాజెక్ట్ విషయంలో ఇచ్చిన సొమ్ము వంతెనల నిర్మాణాలకే అధిక మొత్తం ఖర్చవుతోంది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని గోదావరి పాయలుగా ఉన్న వైనతేయి, గౌతమి, వశిష్ట నదులపై వంతెనలు నిర్మించాలి. రూ.700 కోట్లతో ఈ మూడు వంతెనల పనులు నత్తనడకన సాగుతున్నాయి.

క్లుప్తంగా

అమెరికాలో కేవీఎస్‌కు సన్మానం


అమెరికాలో కేవీ సత్యనారాయణను సన్మానిస్తున్న ఆటా సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కళా రంగానికి, నాట్య రంగానికి చేస్తున్న సేవలకు అభినందిస్తూ తనను అమెరికా తెలుగు సంఘం (ఆటా) ప్రతినిధులు ఈ నెల 21వ తేదీన డల్లాస్ నగరంలో ఘనంగా సత్కరించినట్టు కూచిపూడి నాట్య గురువు, కళారత్న కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటాతో పాటు ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం, తానా సభ్యులు ఈ సన్మాన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రముఖ సాహితీ వేత్త, సంయుక్త కార్యదర్శి శారద సింగిరెడ్డి నిర్వాహణలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆటా ప్రెసిడెంట్ ఎలెక్ట్ సతీష్ రెడ్డి, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ కేవీ సత్యనారాయణ సేవలను కొనియాడారు. ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం వారు ఈ నెల 19న నిర్వహించిన నెల నెలా వెన్నెల సాహిత్య సభ వార్షికోత్సవంలో కేవీ సత్యనారాయణ ప్రదర్శించిన కాలార్చన గూర్చి ప్రశంసిస్తూ అభినందిచారు.

ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలకు జెస్సీ



దెందులూరు: సౌత్‌కొరియాలో ఈనెల 23 నుంచి జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఇంటర్నేషనల్ స్కేటర్ ఎం.జెస్సీ మంగళవారం వెళ్లారు. కోచ్‌తో పాటు వెళుతున్న 9 మందిలో ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు జెస్సీ ఒకరు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో విజయం సాధించాలని కుటుంబ సభ్యులు, బంధువులు, క్రీడాభిమానులు ఆకాంక్షించారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

నూజివీడు: పోక్సో కేసులో ఓ ముద్దాయికి మచిలీపట్నంలోని పోక్సో కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాల ప్రకారం.. నిందితుడు రెడ్డి త్రిమూర్తులు 2019 మార్చి 26న రాత్రి 9 గంటల సమయంలో బాలికను పట్టణంలోని పెద్ద చెరువు ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక అరవడంతో చుట్టుపక్కల వారు రాగా నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. దీనిపై బాలిక తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో మచిలీపట్నంలోని పోక్సో కోర్టు సెషన్స్ జడ్జి గాజుల వెంకటేశ్వర్లు ముద్దాయి రెడ్డి త్రిమూర్తులుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో నెల జైలుశిక్షను అదనంగా అనుభవించాలని, బాధితురాలికి నష్టపరిహారం కింద రూ.50 వేలను చెల్లించాలని జడ్జి ఆదేశాలు జారీచేశారు.

విద్యార్థినులతో పీడీ అసభ్య ప్రవర్తన

కైకలూరు: విద్యాబుద్ధులు బోధించాల్సిన ఉపాధ్యాయులే చెడు మార్గాలు పడుతున్నారు. నియోజకవర్గంలో ఇటీవల భుజబలపట్నం ఉన్నత పాఠశాలలో పదో తరగతి యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) నాగేశ్వరరావు ఘటన మరువక ముందే కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరో ఘటనే మంగళవారం వెలుగు చూసింది. ఇక్కడ కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పీడీ కావడం గమనార్హం. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.స్వర్ణకుమారి, విద్యార్థులు మంగళవారం చెప్పిన వివరాల ప్రకారం పాఠశాల పీడీగా రెండేళ్లగా కోటి రత్నదాస్ పనిచేస్తున్నాడు. వ్యాయామం పేరుతో తమ పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నాడని పీడీపై పదో తరగతి విద్యార్థినులు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై కొద్ది రోజుల క్రితం అతడిని ప్రశ్నించగా దుర్భాషలాడుతూ తనను కొట్టడానికి ప్రయత్నించాడని హెచ్‌ఎం చెప్పారు. అంతేకాక చంపేస్తానని బెదిరిస్తున్నాడని, పోలీసు కానిస్టేబుల్ ఎదుట కూడా పీడీ ప్రవర్తన మారలేదన్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం చెప్పారు. ఇదిలా ఉంటే గతంలోనూ కొన్ని వివాదాల కారణంగా రత్నదాసు సస్పెండ్ అయ్యారని తెలిసింది. దీనిపై పీడీని వివరణ కోరగా తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని అన్నారు. ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ కలిదిండిలో పీడీ ప్రవర్తనపై ఫిర్యాదు అందిందని తెలిపారు. విచారణకు ఆదేశించామని, తప్పు చేసినట్లు నిర్ధారణ జరిగితే విధుల నుంచి తొలగిస్తామని తెలిపారు.

● రండి బాబు... రండి



ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభించి నెల రోజులు దాటినా ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నాయంటూ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమైన వారం రోజులకే క్లాస్‌రూమ్‌లు నిండిపోయి విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఎందుకంటే పాఠశాల ప్రారంభం రోజే పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్‌తో పాటు సమయానికి అమ్మఒడి ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో సగం మంది తల్లులకు తల్లికి వందనం రాక.. నాణ్యమైన బ్యాగులు ఇవ్వక, సరిగ్గా పుస్తకాలు అందకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు పిల్లలు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇలా ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నాయంటూ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఏలూరు లక్ష్మివారపుపేటలోని ఎలిమెంటరీ స్కూల్లో దర్శనమిచ్చిన ఫ్లెక్సీ ఇది.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

విద్యాభ్యాసం.. మురుగునీటితో సహవాసం


జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిలిచిన గ్రామంలోని మురుగు నీరు


ఆ మురుగునీటిలోనే చేతిపంపు వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని మురుగునీరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోకి చేరుతోంది. నీరు బయటకు వెళ్లే మార్గంలేక, డ్రెయిన్ సౌకర్యం లేక రోజుల తరబడి నిలిచిపోతోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు వర్షం కురిస్తే ఇక అంతే సంగతులు. పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తూ ఉంటుంది. మధ్యాహ్న భోజన పథకంలో ద్యార్థులు భోజనం అనంతరం చేతులు శుభ్రం చేసుకునేందుకు ఆ మురుగు నీటిలోనే చేతిపంపు వద్దకు వచ్చి చేతులు శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి. దీంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కచ్చా డ్రెయిన్ తవ్వి నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

● 'బ్యాక్ బెంచ్'కి చెక్


విద్యార్థులను యూ ఆకారంలో కూర్చోబెట్టిన సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్

బ్యాక్ బెంచ్ విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ఉండేందుకు కలెక్టర్ వెట్రి సెల్వి వినూత్న ప్రయోగం చేపట్టారు. కేరళ తరహాలో యూ ఆకారంలో కూర్చునే విధంగా బెంచీలు వేయాలని ఆదేశించారు. దీనిని లింగపాలెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేసేందుకు వచ్చిన జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్ అమలు చేశారు. యూ ఆకారంలో బెంచీలు అమర్చడం వలన విద్యార్థులంతా ఉపాధ్యాయునికి కనబడతారని, దీంతో ఆయన చెప్పే పాఠాలు బాగా అర్థమవుతాయన్నారు. పాఠశాలలోని విద్యార్థులు ఆన్‌లైన్ ప్రకారం ఉన్నారా లేరా డ్రాప్ బాక్స్ విద్యార్థులు ఎంతమంది ఉన్నారు అని రికార్డులు పరిశీలన చేశారు.

– లింగపాలెం

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు శిక్ష

ఏలూరు (టూటౌన్)/పెనుగొండ: అత్యాచారం కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు వెల్లడించారు. పెనుగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బాధిత యువతి వ్యవసాయ కూలీగా జీవనం సాగించేది. సుమారు ఏడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన నిందితుడు అంజూరి ప్రసన్న కుమార్ ప్రేమ పేరుతో ఆమెకు సన్నిహితమయ్యాడు. వివాహం చేసుకుంటానని మోసం చేసి, ఆమెను బలవంతంగా శారీరక సంబంధానికి గురిచేశాడు. అనంతరం నిందితుడు విదేశానికి (గల్ఫ్) పరారయ్యాడు. తన తల్లిదండ్రుల సహకారంతో ఆమెను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీనిపై బాధిత యువతి పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ జీవీవీ నాగేశ్వరరావు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయి అంజూరి ప్రసన్న కుమార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటుగా రూ.5 వేలు జరిమానా విధిస్తూ మహిళా కోర్టు ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ మంగళవారం తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ తిమ్మరాజు నాగబాబు, లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్సై ఎస్.ప్రదీప్ కుమార్ విచారణకు సహకరించారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌లో మెగా టెక్నికల్ మేళా

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 4 నుంచి 14వ తేదీ వరకు ×వేదిక్ విజన్ 2కే 25 పేరిట స్పోర్ట్స్ అండ్ హెల్త్ అంశంపై మెగా టెక్నికల్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు మంగళవారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫుల్ జావా స్టాక్ నైపుణ్యాలను ఉపయోగించి ఆరోగ్య యోగ, క్రీడా రంగాల్లో నూతన పరిష్కారాలను అభివృద్ధి చేసే విధంగా పది రోజుల పాటు జరిగే బూట్ క్యాంపులో విద్యార్థులకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు.

సౌత్ జోన్ రోల్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన పశ్చిమ జట్టుతో కోచ్ లావణ్య

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రోల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ 17, 17 ఏళ్లు పైబడిన విభాగాల్లో పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు ద్వితీయస్థానంలో నిలిచినట్లు రోల్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వానపల్లి లావణ్య తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఆగస్టులో నిర్వహించనున్న సౌత్ జోన్ రోల్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఇటీవల తణుకులో నిర్వహించిన స్కేటింగ్ రోల్‌బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి అండర్ 11, 14, 17, 17 ఏళ్లు పైబడిన వారికి నిర్వహించిన పోటీల్లో అర్హత సాధించిన 20 మంది క్రీడాకారులు కాకినాడలో రోల్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు.

బైక్ చోరీ కేసులో జైలు

ముదినేపల్లి రూరల్: మోటార్‌బైక్‌ల దొంగతనం కేసులో ఓ వ్యక్తికి 164 రోజుల శిక్ష విధించినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం ఉరదాపాలెంకు చెందిన జొన్నల వెంకటేష్ ముదినేపల్లి మండలంలో బైక్ దొంగతనం చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అతడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు పంపిన అనంతరం విచారణ జరిపిన కైకలూరు మేజిస్ట్రేట్ ముద్దాయికి 164 రోజులు జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువడించినట్లు ఎస్సై తెలిపారు.

టిడ్కో ఇళ్ల సమస్య పరిష్కరించాలి


పాలకొల్లు ఎర్ర వంతెన వద్ద సీపీఎం నాయకుల ధర్నా

పాలకొల్లు సెంట్రల్: టిడ్కో ఇళ్లను పూర్తి చేసి సౌకర్యాలు కల్పించి అర్హులైన వారికి అందించాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు ఎర్ర వంతెన వద్ద ధర్నా చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ పాలకొల్లులో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి 18 ఏళ్లు గడిచినా నేటికీ ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని విమర్శించారు. ఇళ్లు పొందిన అర్హులు ఇప్పటికే కొంతమంది చనిపోయారన్నారు. ఈ ప్రభుత్వానికి పేదవాడి ఇంటి సమస్య పట్టడం లేదన్నారు. టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో విష సర్పాల సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, పొదలు తొలగించి పారిశుధ్య సమస్య మెరుగుపరచాలన్నారు. ప్రజలకు నివాసయోగ్యంగా ఉండేటట్లు ఇళ్ళు నిర్మించి వెంటనే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలుగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడచినా ఇంతవరకు ఒక సెంటు భూమి కూడా పేదలకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు

మోటార్‌బోర్ల వైర్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: మోటార్ బోరు కేబుల్ వైర్ల చోరీకి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేగవరం గ్రామానికి చెందిన దార విశ్వేశ్వర శ్రీనివాస్‌కు చెందిన పొలంలో ఈ నెల7వ తేదీ రాత్రి రూ.1.60 లక్షలు విలువైన 650 మీటర్ల బోరు కేబుల్ వైరు చోరీకి గురైంది. అదే రోజు రాత్రి మరో 8 మంది రైతుల పొలాల్లో బోర్లకు సంబంధించి కరెంటు వైర్లు కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే ఈ నెల 9వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన మోటేపల్లి సుబ్రహ్మణ్యంకు చెందిన రూ.2 లక్షలు విలువైన 810 మీటర్ల మోటార్ కేబుల్‌వైరు, సమీపంలోని మరో 8 మందికి చెందిన మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. దీనిపై రైతులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ ఎంవీ సుభాష్ పర్యవేక్షణలో ఎస్సై జబీర్, ఏఎస్సై ఎస్వీ సంపత్‌కుమార్, పీసీ ఎస్.రమేష్ నిందితుల కోసం గాలించారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వేగవరం ఇందిరా కాలనీ వద్ద అదే గ్రామానికి చెందిన నిందితులు తాళరి రామకృష్ణ, చెల్లారి నాగరాజు, పసలపూడి రాజులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 3.60 లక్షల 19 రోల్స్ కేబుల్ వైర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, 15 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

కొత్త రెస్టారెంట్‌లో కుళ్లిన మాంసం

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలో వెల్లడి


రెస్టారెంటులో తనిఖీలు చేస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని స్కై గార్డెన్ రెస్టారెంట్‌లో మంగళవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండానే రెస్టారెంట్ నడుపుతున్నట్లు తనిఖీలో వెల్లడైంది. కుళ్లిన మాంసం, కూరగాయలు, నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులు వాడుతున్నట్టు ఈ సందర్భంగా గుర్తించారు. చికెన్ లాలీపాప్‌లు నిల్వ ఉన్నట్లు కనుగొన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వాడుతుండటంతో వాటిని స్వాధీనం చేసుకుని రూ.5 వేల జరిమానా విధించారు. చికెన్ తందూరి, చికెన్ లాలీపాప్లను శాంపిల్స్ తీసి నాచారంలోని స్టేట్ ఫుడ్ లాబరేటరీకి పంపించారు. రెస్టారెంట్లో గుర్తించిన లోపాలపై అధికారులు యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి కేసు నమోదు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కే.వెంకటరత్నం, జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఏ.సుందరరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

పెదవేగి: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం బాపిరాజుగూడెం గ్రామానికి చెందిన చొదిమెల్ల యాకోబు (45) గ్రామంలో నూతనంగా ఒక ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఈ మేరకు మంగళవారం ఆ ఇంట్లో పనిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం రాయలంలో లావణ్య (28) అనే వివాహిత మంగళవారం ఉదయం ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం టూటౌన్ సీఐ కాళీ చరణ్ తెలిపారు. ఆమె మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.



క్లుప్తంగా

కాంప్లెక్స్ ఎరువులను దమ్ములోనే వేయాలి



కంచుమర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: రైతులు కాంప్లెక్స్ ఎరువులు దమ్ములో వేసుకోవాలని అత్తిలి వ్యవసాయాధికారి టి.కే. రాజేష్ తెలిపారు. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆగస్టు 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు. బ్యాంకు ద్వారా అప్పు తీసుకున్న వారు తప్ప మిగిలిన వారు రైతు సేవా కేంద్రం వద్ద గాని, మీసేవ కేంద్రం వద్ద గాని ప్రీమియం చెల్లించి ప్రయోజనం పొందాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, మంచిలి సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి వెంకట సుబ్బరాజు, వీఏఏలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో మండలంలోని మోదుగ గుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ రెండు విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఆయనను స్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, గ్రామ నాయకుడు కట్టా జానకీరామయ్య మంగళవారం అభినందించారు.

98 ఆవులకు టీకాలు



రామన్నగూడెంలో టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో మంగళవారం ముద్ద వాపు చర్మ వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీపీ.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో 98 ఆవులకు టీకాలువేశారు. కాగా, బుధవారం జగ్గన్నపేట గ్రామంలో టీకాలు వేయనున్నట్లు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

కామాక్షమ్మకు ఆషాఢం సారె



శాకంబరి అలంకరణలో కామాక్షమ్మ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో కొలువైన శ్రీకంచి కామాక్షమ్మకు మంగళవారం గ్రామస్తులు ఆషాఢం సారె సమర్పించారు. అలాగే, ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని వివిధరకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజన సుభాషిణి, వేంపల్లి రంగనాయకులు, తమ్మిశెట్టి చుక్కయ్య, బాలం కృష్ణ, జద్దు హరిబాబు, తాతాజీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే దీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె మంగళవారం నాటికి 5వ రోజుకు చేరింది. మునిసిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు. నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం రూ.21 వేలు నుంచి 24,500లు జీతాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రాట్యూటీ ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడమంచిలి బాబు, ధనాల రాజు, తాడికొండ జయరామ్ కృష్ణ, కొడమంచిలి ప్రసాద్, సతీష్, భాను, కె.దయామణి తదితరులు నాయకత్వం వహించారు. కార్మికులు పాల్గొన్నారు.

ఆర్వోబీ ఫుట్‌పాత్‌పై నడుస్తున్నారా.. జర జాగ్రత్త

- ధ్వంసమైన ఆర్వోబీ ఫుట్‌పాత్
- రాత్రి సమయాల్లో పడిపోతున్న పాదచారులు
- ఎముకలు విరిగిపోతున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



తణుకు ఆర్వోబీపై ధ్వంసమైన ఫుట్‌పాత్‌కు అడ్డుగా పెట్టిన మొక్కల కుండీ



తణుకు ఆర్వోబీపై శ్లాబు దిగబడి ప్రమాదకరంగా మారిన దుస్థితి

తణుకు అర్బన్: తణుకు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై (ఆర్వోబీ) నడుస్తున్నారా అయితే జాగ్రత్త.. ఫుట్‌పాత్‌పై ఉన్న శ్లాబు రాళ్లు దిగబడిపోయి ప్రమాదకరంగా మారడంతో నిత్యం ఎంతోమంది పాదచారులు గాయాలపాలైపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో తణుకు నుంచి పైడిపర్రువైపు వచ్చి వెళ్లే వారు ఫుట్‌పాత్‌పై నడకసాగిస్తున్నారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో ఫుట్‌పాత్‌పై వాకింగ్ కూడా చేస్తున్న పరిస్థితుల్లో నడక మార్గంగా ఉన్న ఫుట్‌పాత్‌పై చాలా చోట్ల రాళ్లు దిగబడిపోవడంతో కాలువేసే సమయంలో గోతిలోపడిపోయి కాళ్లు విరిగిపోతున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు ఆస్పత్రుల పాలైపోతున్నామని వాపోతున్నారు.

రైల్వేగేటు దారి పూర్తిగా మూసిన పరిస్థితుల్లో..

తణుకు రైల్వే గేటు ప్రాంతాన్ని పూర్తిగా నడకకు కూడా వీలులేకుండా స్తంభాలు ఏర్పాటుచేసి మూసివేయడంతో పాదచారులు అధికసంఖ్యలో ఆర్వోబీ ఫుట్‌పాత్‌పై ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆర్వోబీకి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు సమీపంలో ఉండడంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ ప్రాంతంలో ప్రయాణాలు చేస్తున్నారు. వీరిలో చాలా మంది బస్టాండ్ నుంచి తణుకు చేరేందుకు ఆర్వోబీపైకి మెట్ల మార్గంలో ఎక్కి పట్టణంలోకి ఫుట్‌పాత్‌పైనే నడుస్తున్న పరిస్థితులు అధికంగా కనిపిస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆర్వోబీ ఫుట్‌పాత్‌పై ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నా మరమ్మతులు చేయించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

'గూడెం'లో 11.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడచిన 24 గంటల్లో 11.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ మంగళవారం తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి టి ఉమామహేశ్వరరావు సూచించారు. డీఎన్నార్ కళాశాల ప్లాటినం జూబ్లీ హాల్ నందు మంగళవారం స్టూడెంట్స్, కాలేజీ బస్సు డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనాలను నెమ్మదిగా నడపాలన్నారు. రవాణాశాఖ అధికారులు కె.ఎస్.ఎన్ ప్రసాద్, ఎన్.ఎల్.ఎస్ లక్ష్మి, ఏఎస్‌పి తేజ పాల్గొన్నారు.

దళితులపై దాడులు అమానుషం



కోరుకొల్లు వెంకట్రావు

అత్తిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సామాన్య ప్రజలపై అత్యంత పాశవికమైన భౌతిక దాడులు జరుగుతున్నాయని, రాష్ట్రం రావణకాష్టంగా మారిపోయిందని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్ర మంత్రి అనుచరులు ఒక దళిత వర్గానికి చెందిన యువకుడిని అత్యంత దారుణంగా ఒక జంతువును కూడా హింసించకూడని రీతిలో నడిరోడ్డుపై చావుదెబ్బలు కొట్టటం అమానుషమని అన్నారు. రాష్ట్రంలో ఇటువంటి భయంకరమైన పరిస్థితులు మునుపెన్నడూ లేవని, ఇది కూటమి ప్రభుత్వం దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంది అని తెలపడానికి ఈ ఘటనే నిదర్శనం అని, ఉద్యోగం ఇప్పిస్తానని మంత్రి అనుచరులు బాధితుని దగ్గర భారీ మొత్తంలో నగదు కాజేశారని, అది తిరిగి ఇవ్వమని అడిగితే అధికార మదంతో అత్యంత దారుణంగా కొట్టారని తెలిపారు. దళితవర్గాల ప్రజలు అందరూ ఐక్యతగా ఉంటేనే తరతరాలుగా అణగారిన వర్గాలపై జరుగుతున్న ఇటువంటి దుర్మార్గపు దాడులు ఎదుర్కోవచ్చునని ఈ సందర్భంగా దళిత వర్గాలకు వెంకట్రావు పిలుపునిచ్చారు.

గ్రామ సభల్లో సమస్యల మోత



గ్రామసభ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరావు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగిన సభలలో పలువురు గ్రామస్తులు సమస్యలపై నిలదీశారు. ప్రత్తిపాడు గ్రామంలో సర్పంచ్ ఎన్నిక లేకపోవడంతో కనీసం ప్రత్యేకాధికారి కూడా సమావేశానికి రాలేదు. కేవలం కార్యదర్శి, కూటమి నాయకుల సమక్షంలోనే తూతూ మంత్రంగా నిర్వహించిన సభలో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తాగునీరు సక్రమంగా రావడంలేదని, డ్రెయినేజీలు అస్తవ్యస్థంగా ఉన్నాయని తెలిపారు. కొండేపాడు గ్రామంలో తాగునీటి చెరువులలో ఉన్న తామరాకులను తొలగించి తాగునీరు సక్రమంగా అందజేయాలని పంచాయతీ సిబ్బంది కోరారు.

తల్లికి వందనం సొమ్ములు అందలేదు

కూటమిప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పేరున సొమ్ములు తమ కుటుంబంలో అందలేదని ప్రత్తిపాడుకు చెందిన బీర ప్రభాకరరావు గ్రామ సభలో ఆవేదన వ్యక్తంచేశారు. ధ్రువపత్రాలలోఉన్న తప్పులు తొలగించాలని పలుమార్లు అధికారులను కోరినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెస్ట్ గోదావరి ట్యాక్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం తాడేపల్లిగూడెంలో మంగళవారం ఎంపికైంది. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కేవీ కోటేశ్వరరావు, రాష్ట్ర ఈసీ సభ్యులు కేవీఆర్‌లు పర్యవేక్షించారు. జిల్లా అధ్యక్షుడిగా వట్టిపులుసు దాన వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బొర్రా సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా దాసరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ద్రోణం రాజు సప్త సాగర్ రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా బొజ్జ దుర్గ గణేష్, కోశాధికారిగా కట్లపర్తి సూర్యనారాయణ, సభ్యులు 9 మంది ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే పట్టణ కమిటీ ఎన్నిక కూడా జరిగింది. పట్టణ అధ్యక్షుడిగా కొంతేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా తాళ్ళబత్తుల వీరేంద్ర కుమార్, లింగంపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా బూర్లగడ్డ ఎస్ఆర్‌జీ పవన్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మద్దుకూరి వెంకట రమణరావు, కోశాధికారిగా మూకాలు వెంకట దుర్గారావులతో మిగతా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు

కాళ్ల: ఎరువుల వాడకంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాళ్ల మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు రైతులకు తెలిపారు. మండలంలోని సీసలి, కాళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలోని సమగ్ర సస్యరక్షణపై జాగ్రత్తలు, ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీటిలో జీవన ఎరువులు ఎంతో కీలకమని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. వాతావరణ కాలుష్యం అరికట్టవచ్చుని వాతావరణంలో, నేలలో మొక్కలకు అందుబాటులేని పోషకాలను సులభంగా లభ్యమయ్యేటట్లు చేస్తాయని రైతులకు తెలియజేశారు.

రైతుల సహకారంతో వంతెన నిర్మాణం



నూతనంగా నిర్మించిన వంతెన వద్ద మాట్లాడుతున్న సత్యనారాయణ

కాళ్ల: రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా తమ పంటపొలాలకు వెళ్లేందుకు ఆయకట్టు రైతులంతా ఏకమై వంతెన నిర్మాణంకు ముందుకు రావడం శుభపరిణామని రైతు గడి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామం పరిధిలో వాండ్రం–పెదఅమిరం గ్రామాలను కలుపుతూ నారాయణకోడు కాలువపై రైతుల సహకారం సుమారు రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన వంతెన వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెదపుల్లేరు, వాండ్రం మీదుగా పెదఅమీరం చేరుకోవటానికి ఇది దగ్గర మార్గమన్నారు. రైతులు వేగేశ్న శ్రీనివాసరాజు, చిలుకూరి నరసింహారాజు, భూపతిరాజు సుబ్బరాజు, గమిని జువెలర్స్ ప్రసాద్ సహకారంతో వంతెన నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ వంతెన నిర్మాణం వల్ల రైతులతో పాటు వాహనదారులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వంతెన నిర్మాణానికి సహకరించిన రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర పోటీలకు ఆరా ఫౌండేషన్ యోగా సాధకులు



జిల్లాస్థాయి యోగాసన పోటీలలో విజేతలు, యోగా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన ఆరా ఫౌండేషన్ యోగా క్రీడాకారిణిలు ఇటీవల భీమవరంలో జిల్లా స్థాయి యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలు జరగగా పట్టణం నుంచి 10 మంది యోగా సభ్యులు మెడల్స్ సాధించారు. 5 గోల్డ్, 3 సిల్వర్, 2 కాంస్య పతకాలు సాధించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన వారు ఆగస్టులో స్టేట్ లెవిల్ పోటీలకు ఎంపికయ్యారు. మద్దుల సుభద్ర గుప్తా, కొండపల్లి సుజాత, పుల్లెపు లక్ష్మీ రమ్య, పోతురాజు ఉమా దత్త నాగ సమీరా, హాసిని, లాస్యలు విజేతలుగా నిలిచారు. విజేతలను యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఈసీ సభ్యులు కరిబండి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఐ.మాధవరావు, కోశాధికారి వెంకటేశ్వరరాజు, యోగా సభ్యులు తదితరులు అభినందించారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మునిసిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులచే ప్రతిజ్ఞ

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులు అవ్వొద్దని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ మల్లిపూడి హిమ మిత్ర విజ్ఞప్తి చేశారు. కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వశాఖ సహకారంతో మంగళవారం స్థానిక కోడే వెంకట్రావు మునిసిపల్ హైస్కూల్‌లో అవగాహన సదస్సు జరిగింది. మిత్ర మాట్లాడుతూ యువత ఆరోగ్యంగాను, శక్తివంతంగాను, క్రమశిక్షణతో జీవించాలని తెలిపారు. యువత బాధ్యతగా వ్యవహరిస్తు డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని, బానిసైన యువతను సొసైటీ సెంటర్‌కు పంపాలని కోరారు. చెడు వ్యవసానాలకు దూరంగా ఉండాలని పలు సూచనలు చేశారు. సొసైటీ సైకాలజిస్ట్ టి.గంగాధర్ మాట్లాడుతూ కౌమార దశలో విద్యార్థులు ఒత్తిడితోను, అనుకరణ, తత్కాలిక ఆనందం కోసం మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులవుతున్నారని, విద్యార్థులు ఒత్తిడి లేని జీవితాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మత్తు పదార్థాలు వల్ల అనర్థాలే అధికమని హెచ్చరించారు. మాదక ద్రవాలకు దూరంగా ఉండాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈవీ కృష్ణారావు, ఉపాధ్యాయులు, సొసైటీ సిబ్బంది టి.నవీన్, కేవీ సాయితేజ, పి.వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి శతజయంతి



తణుకులో దాశరథి శత జయంతి వేడుకలో పాఠశాల హెచ్ఎంను సత్కరించిన దృశ్యం

తణుకు అర్బన్: సినీగేయ రచయిత దాశరథి శతజయంతిని సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు దాశరథి సృష్టించిన కవితలు, సినీ గేయాలు ఆహుతులను అలరింపచేయడమే కాకుండా ఉద్యమ పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పాటల పోటీలు, సదస్సు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హెచ్ఎం ఉద్దరాజు రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నడిపల్లి వెంకట రాజేష్, రాపాక కర్నేలు, కానూరి రాజామణి, కొమ్మరకుంట ఇందిర, మహాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌కి భూమి సేకరణ



ఆకివీడు: భూయజమానులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఆకివీడు: జాతీయ రహదారి నెం.165కు బైపాస్ రోడ్డుగా ఉప్పుటేరు నుంచి అయిభీమవరం, అజ్జమూరు మీదుగా ఎన్‌హెచ్ పాత రోడ్డుకు వచ్చే మార్గంలోని భూముల సేకరణపై అభ్యంతరాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 అడుగుల వెడల్పున భూమి సేకరణ కొనసాగుతోందన్నారు. జాతీయ రహదారుల శాఖ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డు ప్రకారం భూ సేకరణ చేస్తామన్నారు. దీనిలో అభ్యంతరాలుంటే సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. భూమి యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ఆయా ప్రాంతాల్లో జరిగిన భూమి విలువలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ నిబంధనల మేరకు సొమ్ము చెల్లిస్తారని చెప్పారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములను పరిశీలిస్తామన్నారు. వ్యవసాయేతర భూములు కన్వర్షన్ ఫీజు చెల్లించి ఉండాలని జేసీ తెలిపారు. భూ సేకరణకు సంబంధించి అజ్జమూరు ప్రాంతంలో 43 ఫిర్యాదులు అందినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ డీఈ శ్రీనివాస్, జిల్లా కలెక్టరేట్ సూపరింటిండెంట్ సీహెచ్. రవికుమార్, తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్ బీఎస్‌వీ.లక్ష్మి, డీటీ జి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్స్ పరిశీలన

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్స్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎల్ఎస్ పాయింట్, బఫర్ గోదాములను ఆయన పరిశీలించారు. ప్రజలకు అందించే బియ్యం నాణ్యతను పరిశీలించి సేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాలకు స్టేజ్–2 ద్వారా చేసే రవాణా గురిచి అధికారులతో సమీక్షించారు. గోదాముల మరమ్మతులపై పరిశీలన చేసిన జేసీ గోదాములకు వెంటనే రిపేర్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం ఎండీ ఇబ్రహీం, అధికారులు అష్ట, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆధునికీకరణ ఎప్పుడో?



ఆధునికీకరణకు నోచుకోని పాలగుండం చెరువు

ఇరగవరం: మండలంలోని ఇరగవరంలో పాలగుండం చెరువు కనీస మరమ్మతులకు నోచుకోక పూడిపోయింది. గ్రామంలో వేంచేసియున్న ప్రసిద్ధ శివాలయం పాలేశ్వరస్వామి దేవాలయం ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ దేవాలయానికి ఎదురుగా ఉన్నా పాలగుండం చెరువుకు కూడా అంతే ప్రాధాన్యత ఉంది. భక్తులు ఆలయంలోకి వెళ్లేటప్పుడు తప్పకుండా ఈ చెరువులో కాళ్లు కడుక్కొని వెళతారు. అందులోని నీరు స్వామి వారికి అభిషేకాలకు ఆలయ అర్చకులు వినియోగించే వారు. అంతే కాకుండా ఈ చెరువులో పెరిగిన చేపలను పట్టుకొని నొక్కితే ఆ చేపల నుంచి చిన్నగా పాలు కారేవి అనేది ఇక్కడి ప్రజలు ఎవరిని అడిగినా చెబుతారు. ఇప్పుడు ఆ చెరువు మురుగు నీటితో నిండిపోయి పూర్తిగా పనికి రాకుండా పోయింది.

మాజీ మంత్రి కారుమూరి చొరవతో..

గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన దానిని ఆధునీకరించేందుకు ఆర్థిక సాయం అందజేశారు. దీనికి తోడు దాతల సహకారంతో ఆధునికీకరణ బాధ్యతను ఆలయ కమిటీ, కార్య నిర్వహణ అధికారికి అప్పగించారు. దీంతో చెరువు మధ్యలో విగ్రహం ఏర్పాటు చేసి చెరువును తవ్వి నీటిని శుభ్రపరిచి, చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించేందు అధికారులు, నాయకులు పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా పనులు ప్రారంభించి కొంత వరకు పనులు చేశారు. పనులు పూర్తయ్యి పాలగుండం చెరువు అందుబాటులోకి వస్తుందని అందరూ అనుకున్నారు. అయితే ప్రభుత్వం మారిపోవడంతో పనులు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పట్టించుకోవలసిన అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో పాలగుండం చెరువులోని నీరు పూర్తిగా నాచు పట్టి నీరు రంగు మారిపోయి దుర్వాసన వస్తుంది. చెరువు మధ్యలో విగ్రహం కోసం ఏర్పాటు చేసిన కాంక్రీట్ చిన్న వంతెన అలాగే ఉండిపోయింది. చెరువు చుట్టూ వేసిన వాకింగ్ ట్రాక్ మట్టిలో కలిసి పోయింది. దీనికి తోడు ట్రాక్ మీద పిచ్చి పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ప్రభుత్వం, దాతలు ఇప్పటికైనా పట్టించుకొని పాలగుండం చెరువును ఆధునికీకరణ చేసి, భక్తులకు, గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



మధ్యలో నిలిచిపోయిన దాతల సహకారంతో మొదలు పెట్టిన పనులు



మట్టిలో కలిసిపోయిన పాలగుండం చెరువు వద్ద వేసిన వాకింగ్ ట్రాక్

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన కల్పించడం గొప్ప విశేషమని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి కమలాకర్ అన్నారు. ప్రభుత్వ ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్‌ను పారదోలి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గత 4 నెలలుగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారాలు, హెచ్చరికలు చేస్తున్నామని, కొంతమంది వ్యాపారస్తులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అనంతరం కళాశాలనుంచి గంగులమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు.